వచ్చే నెల ఐదు నుంచి విశాఖ, అరకు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 20: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 5 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం-అరకు మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08525 నంబరు గల రైలు వచ్చే నెల ఐదు నుంచి ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలు దేరి 11.30 గంటలకు అరకులోయ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరు గల రైలు మధ్యాహ్నం 2.00 గంటలకు అరకులో బయలు దేరి సాయంత్రం 6.00 గంటలకు విశాఖ చేరుతుంది.

ఏవోబీలో ఉత్కంఠ

నేటి నుంచి మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు

- పార్టీ బలోపేతానికి వ్యూహాత్మక అడుగులు
- గ్రామ సభలతోపాటు రిక్రూట్‌మెంట్‌కు ప్రణాళిక
- అడవులను జల్లెడ పడుతున్న పోలీసులు
- ముమ్మరంగా కూంబింగ్


గ్రామసభలో మాట్లాడుతున్న మావోయిస్టు పార్టీ నేతలు (ఫైల్)

చింతపల్లి, సెప్టెంబరు 20:
ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో ఉత్కంఠ వాతావరణం నెల కొన్నది. సీపీఐ మావోయిస్టు పార్టీ శనివారం నుంచి వారం రోజులపాటు 20వ ఆవిర్భావ వారోత్సవాన్ని జరుపుకోనున్నది. ఈ సందర్భంగా పార్టీ రిక్రూట్‌మెంట్‌కి ప్రాధాన్యమిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. వారోత్స వాలు విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ ప్రయత్నం చేస్తుండగా.. భగ్నం చేసేందుకు పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేసింది. దీంతో సరిహద్దు గిరిజన గ్రామాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

1967లో శ్రీకాకుళం రైతాంగ పోరాట సమితితో ప్రారంభ మైన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం సాయుధ పోరాటానికి దారితీసింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, ఒడిశా ప్రాంతాల్లో నక్సల్స్ పార్టీ ఏర్పడింది. కాలక్రమంగా కొండపల్లి సీతారామ్ నాయకత్వంలో నక్సల్స్ పార్టీ పీపుల్స్‌వార్ గ్రూప్(పీడబ్ల్యు జీ)గా ఏర్పడింది. 1982 నుంచి దేశ వ్యాప్తంగా ప్రాంతీయ ప్రభుత్వ వ్యతిరేక సాయుధ పోరాట పార్టీలు విస్తరించాయి. దాదాపు దేశంలో 16 రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక సాయుధ పోరాట పార్టీలు విస్తరించాయి. ప్రాంతాల వారీగా ప్రభుత్వ వ్యతిరేక సంస్థలు పోరాటం చేయడం వల్ల లక్ష్యసాధన కష్ట మవుతుందని జాతీయ స్థాయిలో వివిధ సంస్థల అగ్రనే తలు 2001-02లో చర్చించుకొని, 18 ప్రాంతీయ ప్రభుత్వ వ్యతిరేక పోరాట పార్టీలన్నీ ఒకే గొడుగు కింద వచ్చేందుకు నేపాల్ మావోయిస్టు పార్టీతో చేతులు కలిపాయి. 2004 సెప్టెంబరు 21న దేశంలోనున్న 18 విప్లవ సాయుధ పోరా ట సంస్థలు కలిసి మావోయిస్టు పార్టీగా ఆవిర్భానికి నాంది పలికాయి. మావోయిస్టు పార్టీ ఆవిర్భావం అనంతరం పీపుల్స్‌వార్ గ్రూప్ నాయకులే అత్యధికులు ఉన్నత పదవు లను స్వీకరించారు.


చింతపల్లిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పార్టీ బలోపేతానికి వ్యూహాత్మక అడుగులు

మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు పూర్తికావడంతో కేంద్ర కమిటీ సభ్యులు దళాలను బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. గతం లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో సభ్యులు మావోయిస్టు పార్టీలో పనిచేసేవారు. పలు కీలక పదవులు చేపట్టారు. కాలక్రమంగా ఎన్‌కౌంటర్లలో అగ్రనే తలు మరణించడం, లొంగుబాట్లు, అరెస్టులు కారణంగా పార్టీ క్యాడర్ కొంత బలహీన పడింది. తూర్పు కనుముల్లో మావోయిస్టు పార్టీ స్తబ్దంగా ఉన్నప్పటికీ చాపకింద నీరులా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ వారోత్సవాల్లో గ్రామ సభలతోపాటు రిక్రూట్‌మెంట్ ని ర్వహించి దళాలను పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని కేంద్ర క మిటీ సభ్యులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది.

అడవులను జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలను భగ్నంతో పాటు కదలికలను సైతం నియంత్రించాలనే లక్ష్యంతో పోలీ సు ప్రత్యేక బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. వారోత్సవాలు ప్రారంభానికి 12 రోజుల ముందు నుంచే ఏవోబీలో పోలీసు బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. అలాగే ప్రధాన కేంద్రాల్లో యాక్షన్ టీం సభ్యులు సంచరించే అవకాశముందని 24 గంటలూ వాహన తనిఖీ లు నిర్వహిస్తున్నారు. రహదారులకు, కల్వర్టుల వద్ద బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాయి.

సందడిగా ఇది మంచి ప్రభుత్వం

నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణ

- అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు హాజరు
- పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అనంతగిరిలో టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర హాజరు
- రంపచోడవరంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సంద ర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. ఆర్థిక సంక్షోభ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం పింఛన్ల పెంపు, ఒకవ తేదీనే ఉద్యోగులకు జీతాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, తదితర ఎన్నో ప్రజారంజక కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొం డమ్మ కల్యాణ మండపంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను ప్రజలకు వివరించారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఎంవీవీ.ప్రసాద్, చల్లంగి లక్ష్మణరావు, జ్ఞానే శ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే అరకులోయ నియోజకవర్గం అనంతగిరి మండలం బొర్రాహులుగూడ గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్య క్రమంలో టీడీపీ నియోజకవర్గ ... మిగతా 8వ పేజీలో



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ప్రజల్లో అవగాహనకు గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన కూటమి నాయకులు

మన్యంలో కుండపోత

- నాలుగు గంటల వరకు తీవ్రమైన ఎండ
- తర్వాత అన్ని మండలాల్లో భారీ వర్షం
- జన జీవనానికి అంతరాయం


పాడేరు- విశాఖపట్నం మెయిన్‌రోడ్డుపై కురుస్తున్న వర్షం

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో శుక్రవారం సాయం త్రం భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లా వ్యా ప్తంగా తీవ్రమైన ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారి పోయి వర్షం మొదలైంది. వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని దాదాపుగా అన్ని మండలాల్లోనూ ఒకే తరహాలో వర్షం కురిసింది. తాజా వర్షానికి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించలేదు.

నిండు కుండల్లా మినీ రిజర్వాయర్లు

- అయినా ఆయకట్టు రైతులకు అందని సాగునీరు
- సిమిలిగుడ, కొర్రాయి రిజర్వాయర్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు నిల్
- రెండు వైపులా కోతలకు గురైన మినీ రిజర్వాయర్లు
- ఆందోళన చెందుతున్న గిరి రైతులు

అరకులోయ/డుంబ్రిగుడ, సెప్టెంబరు 20:
ఇటీవల కురిసిన వర్షాలకు అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోని సిమిలిగుడ, కొర్రాయి మినీ రిజర్వా యర్లు నిండుకున్నాయి. సిమిలిగుడ రిజర్వాయర్ పొర్లుకట్టు పొరుతున్నప్పటికీ ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు మినీ రిజర్వాయర్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


సిమిలిగుడ మినీ రిజర్వాయర్


కొర్రాయి మినీ రిజర్వాయర్

రైతులకు అందని సాగునీరు

అరకులోయ మండలంలోని సిమిలిగుడ వద్ద మినీ రిజర్వాయర్ 1972లో నిర్మించారు. నాడు ఐరన్ వినియోగించకుండా కేవలం సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టారు. గద్యాగుడ, సిమిలిగుడ, బొసుబెడ్డ గ్రామ రైతుల పంట పొలాలకు ఈ నీరు ఉపయోగపడుతుంది. దీని ఆయకట్టు 1600 ఎకరాలకు పైగా ఉన్నప్పటికీ కేవలం 500 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతున్నదని రైతులు తెలిపారు. కాలువల నిర్మాణం లేకపోవడంతో బెంజి ఫైర్, పానిరంగిని గ్రామాల పొలాలకు నీరు అందడం లేదు. అయితే ఈ రిజర్వాయర్‌కు ఏళ్ల తరబడి ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. రెండు వైపులా కోతకు గురవడంతో ... మిగతా 8వ పేజీలో

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టండి

అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదు

- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్
- మీకోసం కార్యక్రమంలో 126 వినతుల స్వీకరణ


మీ కోసంలో అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారులు

పాడేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):
ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌క లెక్టర్ శౌర్యమన్‌పటేల్‌లతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతో దూరం నుంచి వచ్చి తమ సమస్యలను అధికారులు పరిష్కరిస్తారని ఆశతో వస్తారని, వారికి తగిన విధంగా సేవలందించాలన్నారు. మీ కోసం వినతుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే రెవెన్యూ డిపార్టుమెంటులో 131, పంచాయతీరాజ్ శాఖలో 21, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 12, గిరిజన సంక్షేమ శాఖలో 18 అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. అర్జీల పరిష్కారానికి జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

126 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం కార్యక్ర మంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు 126 విన తులను స్వీకరించారు. ఏజెన్సీలో రహదారుల నిర్మాణాలు, తాగునీటి సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల మంజూరు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, తదితర సమస్యలపై అధికారులకు వినతులను సమ ర్పించారు. ముంచంగిపుట్టు మండలం బరడ గ్రామానికి చెందిన మోహన్‌దాసు, బుంగాపుట్టు, లక్ష్మీపురం, బరడ పంచాయతీలకు చెందిన గిరిజనులకు ముంచంగిపుట్టు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఏడు వేల వరకు ఖాతాలున్నాయని, ఖాతాదారులకు అందుబాటులో ఉండేలా కస్టమర్ సర్వీసు ప్రొవైడర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. చింతపల్లి మండలం బలపం గ్రామస్థుడు బి.చిరంజీవి తన తండ్రి పేరు ఆన్‌లైన్‌లో కనబడక పోవడంతో రైతు భరోసా అందడం లేదని, దానిని సవరించాలని కోరారు. అనంతగిరి మండలం కాకరపాడు గ్రామస్థులు ఎగువశోభ నుంచి కాకరపాడు గ్రామం వరకు తారురోడ్డు నిర్మించాలని కోరగా, డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్ సర్పంచ్ పి.రామ్మూర్తి, పంచాయతీ పరిధిలోని బొడ్లమామిడి, డెక్కపారు, వై.కొల్లాపుట్టు తదితర గ్రామాలకు చెక్‌డ్యామ్‌లను నిర్మించి పంట పొలాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, టీడబ్ల్యూ స్పెషల్ డి ప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్ బాషా, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, సీపీవో ఆర్.కె.పట్నాయక్, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్ జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధి కారి రమేశ్‌కుమార్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఏడాది కిందట నివేదిక


- నాటి వైసీపీ కీలక నేతల హస్తం?
- తప్పును గుర్తించి, అడ్డుకున్న జేసీని బదిలీ చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం రావడంతో వెలుగులోకి అక్రమాలు
- ఆర్డీవో సహా ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం
- ఉన్నతాధికారుల తాత్సారం

విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):
ఆయనో రెవెన్యూ ఉన్నతాధికారి. ప్రభుత్వ భూములను, ఆస్తులను రక్షించాల్సిన ఆయన...అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన భూమి ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు తన వంతు సహకారం అందించారు. గత ప్రభుత్వ పాలకులు తమ అవసరాల కోసం ఏరికోరి తెచ్చుకున్న సదరు అధికారి తప్పు చేసినట్టు తేలినా కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాల విభజన అనంతరం విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన భీమిలి రెవె న్యూ డివిజన్ అధికారిగా వచ్చిన ఎస్.భాస్కరరెడ్డి వైసీపీ నేతలు చెప్పిందల్లా చేశారన్న ఆరో పణలు ఉన్నాయి. డివిజన్‌లో వందలాది ఎకరాల డీపట్టా భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారంలో అప్పటి పాలకులు/ఉన్నతాధికారులు చెప్పినట్టు నడుచుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తికి అనుకూలంగా నివేదిక ఇచ్చిన విషయం వెలుగుచూసింది.

కోట్ల విలువైన భూమి పరాధీనం చేసే యత్నం

మధురవాడలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన హరిత గృహ సముదాయానికి ఎదురుగా సర్వే నంబరు 133లో గల 9.36 ఎకరాలను 2008లో హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వ ం బదలాయించింది. అప్పట్లో విశాఖ రూరల్ తహసీల్దారుగా ఇదే భాస్క రరెడ్డి ఆ భూములను హౌసింగ్ బోర్డుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ 9.36 ఎకరాలు హౌసింగ్ బోర్డు ఆధీనంలోనే ఉంది. ఈ భూమిలో హౌసింగ్ బోర్డు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచిం ది. ఆ భూమిపై కన్నేసిన ఒక వ్యక్తి సర్వే నంబర్ 133లో 3.47 ఎకరా లు తనదంటూ ఏడాది క్రితం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చే సుకున్నారు. భూమి కొట్టేయడానికి వీలుగా తప్పుడు పత్రాలు సృష్టించా రు. ఐటీ సంస్థలు, భారీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు ఉన్న ఆ ప్రాంతంలో ఎకరా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు పలుకుతుంది. తప్పు డు పత్రాలతో భూమి కాజేసే యత్నం వెనుక నాటి వైసీపీలో కీలక వ్యక్తులు ఉండడంతో అధికారులు ఫైలు ఆగమేఘాలపై ముందుకు కదిపారు. సర్వే నంబరు 133లో 9.36 ఎకరాలను హౌసింగ్ బోర్డుకు అప్పగించిన విషయాన్ని ప్రస్తావించకుండా భీమిలి ఆర్డీ వో ద్వారా జేసీకి పంపారు. ఈ ఫైలు అందే సమయంలో జేసీగా విశ్వనాథన్ ఉన్నారు. అదే సమయంలో మధురవాడలో తమకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని హౌసింగ్ బోర్డు అధికారులు జేసీకి చెప్పడంతో పాటు భూమి వివరాలు అందజేశారు. దీంతో ఆయన అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అ ప్పటికే తన వద్ద ఉన్న ఫైలులో ఉన్న సర్వే నంబరు, బోర్డు అధికారులు ఇచ్చిన సర్వే నంబ రు ఒక్కటే కావడవంతో ఆయనకు అనుమానం ... మిగతా 8వ పేజీలో


భాస్కరరెడ్డి

సాహితీ సంస్కర్త... గురజాడ



- సంఘ సంస్కరణలకు సాహితీ సేద్యం
- మూఢనమ్మకాలపై అక్షర పోరాటం
- సామాజిక రుగ్మతలపై ఎలుగెత్తిన గళం
- నేడు గురజాడ వేంకట అప్పారావు జయంతి

'తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి, డామిట్ కథ అడ్డం తిరిగింది, పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్'... ఈ మాటలు వింటే గుర్తుకొచ్చేది మహాకవి గురజాడ. అజ్ఞానం, మూఢత్వంతో నిండిన సమాజాన్ని అక్షర సేద్యంతో జ్ఞాన జ్యోతి వెలిగించిన సాహితీవేత్త గురజాడ వేంకట అప్పారావు. ఆధునిక సాహిత్య యుగకర్తగా పేర్గాంచిన ఆ మహాకవి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన రచనల్లో అగ్రగణ్యమైనది కన్యాశుల్కం నాటకం. డబ్బు కోసం చిన్న పిల్లల్ని ముసలివారికి ఇచ్చి పెళ్లి చేసే దురాచారం, వేశ్యా లోలత్వంతో ఎదురయ్యే సమస్యలపై ఒకేసారి కలం ఝుళిపించి సాంఘిక దురాచా రాలను కడిగి పారేసిన అక్షరయోధుడు. ఆ మహనీయుడు పుట్టినది ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్.రాయవరం. నేడు గురజాడ జయంతి సందర్భంగా కథనం. విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి/ ఎస్.రాయవరం

ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసిద్ధి రాయవరం (ఎస్.రాయవరం)లో 1862 సెప్టెంబరు 21న వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు గురజాడ వేంకట అప్పారావు జన్మించారు. ఉన్నత చదువుల కోసం విజయనగరం వెళ్లారు. వచన, వ్యవహారిక భాషకు ఆద్యుడిగా పేరొందిన గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ ప్రాణస్నేహితులు. 1915 నవంబరు 30న భౌతికంగా దూరమైనా ఆయన రచనలు ఇప్పటికీ పాఠక హృదయాల్లో నిలిచిపోయాయి. పూర్వం సర్వసిద్ధిలో కోర్టు ఉండేది. గురజాడ తాతగారు అక్కడే పనిచేసే వారు. గురజాడ తల్లి ప్రసవం కోసం ఎస్.రాయవరం వచ్చారు. అక్కడ మేనమామ ఇంట గురజాడ జన్మించారు.




19వ శతాబ్దంలో సామాజిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని దార్శనిక దృక్పథంతో రచనలు చేసిన కొద్దిమందిలో గురజాడ ఒకరు. ఆధునిక సాహిత్యంలో కొత్త ఒరవడులకు శ్రీకారం చుట్టి తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన కవి. తరాలు మారినా ఇప్పటికీ 'కన్యాశుల్కం' పాఠకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉండడానికి అదే కారణం. కన్యాశుల్కం ఇతర భాషల్లోకి అనువాదమై ఆదరణ పొందేందుకు ఇతివృత్తం, రచనలోని పటుత్వమే నిదర్శనం.

గ్రాంథికం నుంచి వ్యవహారికానికి...

గురజాడ రచనలు ప్రారంభించే నాటికి సంప్రదాయవాదులదే ఆధిపత్యం. గ్రాంథికానిదే పైచేయి. ఆ సమయంలో వ్యావహారిక భాషలో రచనలు ప్రారంభించి ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక శైలికి శ్రీకారం చుట్టారు. ఇతివృత్తమే ప్రధానంగా రచనలు సాగించారు. ఇందుకు కన్యాశుల్కం ఉదాహరణ. ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా గురజాడ సరాసరి కథను ప్రారంభించేవారు. నాటి సాంఘిక దురాచారాలైన కన్యాశుల్కం, వేశ్యాలోలత్వం ఇందులో ప్రధాన కథా వస్తువు. భర్త తీరుపై అసంతృప్తి ఉందని పుట్టింటికి పారిపోకుండా, అతనితో తగాదా పెట్టుకోకుండా, గడప దాటకుండా భర్తకు బుద్ధిచెప్పిన భార్య తీరును గుర్తు చేస్తుంది ఈ నాటకంలోని కథానాయకి పాత్ర.

మలయాళంలోకి గురజాడ సాహిత్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 20: గురజాడ అప్పారావు సాహిత్యాన్ని గురజాడ కళామంజిరి పేరిట నగరానికి చెందిన ప్రముఖ రచయిత, అనువాదకులు ఎల్‌ఆర్‌స్వామి మలయాళంలోకి అనువదించారు. ఈ భాషలోకి అనువదించిన గురజాడ అప్పారావు తొలి సాహిత్యం ఇదే. ఇందులో గురజాడ రచించిన ఆరుకథలతో పాటు గురజాడ దేశభక్తి గేయం ఉంది. గురజాడ సాహిత్యంపై ప్రముఖ రచయితలు విహారి, వివినమూర్తి, చాగంటి తులసి, అట్టాడ అప్పలనాయుడు, కేపీ శివకుమార్, డాక్టర్ ఎన్.రజని, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య కిన్నెర శ్రీదేవి, కిరణప్రభ రాసిన వ్యాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. గురజాడ ఫౌండేషన్ (అమెరికా) అధ్యక్షుడు కొవ్వలి గోపాలకృష్ణ కోరిక మేరకు దీనిని అనువదించారు. ఈ పుస్తకాన్ని పరిధి పబ్లికేషన్స్ తిరువనంతపురం (కేరళ), గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్తంగా ప్రచురించాయి. ఈ పుస్తకాన్ని తిరువనంతపురంలో ప్రముఖుల చేతులమీదుగా ఆవిష్కరించనున్నట్టు ఎల్ఆర్ స్వామి తెలిపారు.



మలయాళంలో గురజాడ పుస్తకం

మతిమరుపుతో జాగ్రత్త!

తొలిదశలో వైద్యులను సంప్రదిస్తే మేలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఓ వయసు వచ్చాక జ్ఞాపక శక్తి తగ్గడం సాధారణం. ఇది అసాధారణమైతే అల్జీమర్స్ అంటారు. అచ్చతెలుగులో 'మతి మరుపు వ్యాధి' అని అర్థం. మెదడులోని జ్ఞాపకాలు చెరిగిపోవడం అల్జీమర్స్. నేడు అల్జీమర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

65 ఏళ్లు దాటిన వారిలోనే సమస్య అధికం


- వ్యాధిగ్రస్తులకు కుటుంబ సహకారం అవసరం
- నేడు ప్రపంచ అల్జీమర్స్ డే

మతిమరుపు (డిమాన్షియా) రెండు రకాలు. మొదటిది వాస్క్యులర్ డిమాన్షియా. మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగని వారిలో ఈ సమస్య కనిపిస్తుంది. పక్షవాతం, అధిక రక్తపోటు, డయాబెటిక్, స్మోకింగ్, అధిక కొలస్ట్రాల్, మద్యం అలవాటున్నవారిలో కనిపిస్తుంది. సకాలంలో వైద్యుడిని సంప్రదిస్తే వ్యాధి తీవ్రత పెరగకుండా చూడొచ్చు. రెండోది సూడో డిమాన్షియా. వాస్తవంగా ఇది వ్యాధి కాదు. మందులతో నయమయ్యే సమస్య. అధిక ఒత్తిడి, డిప్రెషన్, మద్యం, మాదక ద్రవ్యాల అలవాటు ఉన్నవారిలో సమస్య ఎక్కువ. ఇక మెదడులో కణితులు, ఇన్‌ఫెక్షన్ ఉంటే దానివల్ల కూడా అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది.

65 ఏళ్లు దాటాక...

అరవై ఐదేళ్లు దాటాక మతిమరుపు సాధారణం. వీరిలో జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఇది అసాధారణంగా ఉండడం, చిన్నచిన్న విషయాలు గుర్తుండకపోవడాన్ని అల్జీమర్స్ అంటారు. మెదడులోని కొన్ని కణాలు దెబ్బతినడం వల్ల వస్తుంది. సమస్యకు ఇదీ ప్రత్యేక కారణమనేది లేకున్నా జన్యుపరమైన అంశాలు కొంతవరకు కారణం.





ఇలా గుర్తించాలి (మొదటి దశ)

- కళ్లద్దాలు, పెన్ను, సెల్‌ఫోన్‌తో పాటు దారి కూడా మర్చిపోవడం.
- ఎప్పుడూ చేసే పనులు చేసుకోలేకపోవడం
- ఒక విషయంపై ఆలోచన చేయలేక పోవడం
- పొంతనలేకుండా మాట్లాడడం, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోలేకపోవడం

తీవ్రత పెరిగితే...

- కుటుంబ సభ్యులను కూడా గుర్తించలేక పోవడం, అయోమయంగా చూడడం.
- కుటుంబ సంబంధాలు మరచిపోవడం
- ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా గొణగడం
- స్నానం చేసి దుస్తులు వేసుకోకుండా రావడం
- ఆహారం తీసుకున్న విషయం కూడా గుర్తు లేకపోవడం.

చికిత్స విధానం

ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే 'డొనిఫిజల్, ఇవాస్టిగ్నమిన్' వంటి మందులు ఇస్తారు. దీని వల్ల మెదడులో హార్మోన్ల విడుదల జరిగి కణాలు క్రియాశీలకమవుతాయి. వ్యాధిగ్రస్తులకు కుటుంబ సభ్యుల సహకారం అవసరం. నిత్యం రోగితో మాట్లాడుతుండాలి. వారి మెదడుకు పనిచెప్పేలా చెస్, క్యారమ్స్, సుడోకో వంటి ఆటలు ఆడించాలి. తప్పులు చేస్తే విసుగు చెందకూడదు. ఉద్యోగ విరమణ తర్వాత పని మానేయకుండా మెదడుకు ఏదో ఒక పని చెప్పాలి.

అల్జీమర్స్ లక్షణాలు

సాధారణంగా ప్రతి ఒక్కరిలో తక్షణ, రీసెంట్, రిమోట్ జ్ఞాపకశక్తులు ఉంటాయి. వ్యాధి బారినపడిన వారు ఈ మూడు రకాల జ్ఞాపక శక్తులను మెల్లగా కోల్పోతారు. తొలి రెండురకాల జ్ఞాపకశక్తులను వేగంగా కోల్పోయినా, రిమోట్ మెమొరీ కొన్నాళ్లు బాగానే ఉంటుంది. వ్యాధి తీవ్రత పెరిగేకొద్ది ఇదీ పోతుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే పేర్లు, వస్తువులు కూడా గుర్తించలేరు.

యువతలోనూ మతిమరుపు సమస్య



మతిమరుపు కేసులు కొన్నాళ్లుగా పెరుగుతున్నాయి. కేజీహెచ్‌లో ప్రత్యేకంగా మెమరీ క్లినిక్ నిర్వహిస్తున్నాం. ఈ క్లినిక్‌కు ప్రతిరోజూ 15 మంది వరకు వస్తున్నారు. ఓపీకి కూ డా ఈ సంబంధిత సమస్యలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో 30 నుంచి 40 ఏళ్లలోపు యువత ఒకరిద్దరు ఉంటున్నారు. యువతలో మతిమరుపు సమస్యకు ప్రధానం గా బి 12, విటమిన్ ఈ, నియాసిన్ లోపంతోపాటు ఆటో ఇమ్యునో ఎన్‌సెఫైటిస్, థైరాయిడ్ వంటి సమస్య కనిపి స్తోంది. బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడం, ఇతర మార్పులతో పెద్దవారిలో మతిమరుపు అధికమవుతోంది. 50 ఏళ్లు దాటిన వారిలో బ్రెయిన్ పరిమాణం తగ్గుముఖం పట్టడం, బ్రెయిన్ క్లాట్స్, ఒత్తిడి, బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్, ట్యూమర్స్, మెదడుకు గాయాలు కారణమవుతున్నాయి. సమస్యను గుర్తించి మందు లు వాడితే కొంత ఫలితం ఉంటుంది. అల్జీమర్స్‌పై అవగాహ న కల్పించేందుకు బీచ్ రోడ్డులో శనివారం ఉదయం వాక్, ఉచిత క్లినిక్ ఏర్పాటు చేస్తున్నాం.

- డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

క్రైం... crime news

64 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

- కారు స్వాధీనం



గంజాయితో దొరికిన నిందితులు

దేవరాపల్లి, సెప్టెంబరు 20: గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు చేసి కారుతో పాటు 64 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సిబ్బందితో శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా వైపు నుంచి వచ్చిన కారు తనిఖీ చేపట్టగా, అందులో రూ.64 కిలోల గంజాయి దొరికింది. దీంతో కారులో ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పనసపుట్టు పంచాయతీ శివారు జామిగుడ గ్రామానికి చెందిన కొర్రా రంజు (30), కొర్రా అర్జున్ (28)తో పాటు పెదబయలుకు చెందిన కారు డ్రైవరు కూడా కార్తీక్ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో రంజు, అర్జున్ గంజాయి పండిస్తుంటారని ఎస్ఐ చెప్పారు. కారు యజమాని గుంజా గోపి, హుకుంపేటకు చెందిన గన్నెల పట్టుకు చెందిన కొర్రా శివ కలసి ఈ 64 కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు. నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.

నాలుగు లీటర్లు సారాతో ఒకరిని అరెస్టు

గొలుగొండ, సెప్టెంబరు 20: నాలుగులీటర్లు నాటుసారాతో ఒకరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ దళిత కాలనీలో నాటుసారా విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మట్ల చిలకారావు నాటుసారా విక్రయిస్తుండగా ఆయన వద్ద నాలుగు లీటర్లు నాటుసారా స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నర్సీపట్నం కోర్టుకు హాజరుపర్చగా ఈ వ్యక్తికి కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

లా వర్సిటీలో 'డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీ'లు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 20: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత, ప్రాచుర్యం పెరిగిందని ఇక్కడి దామోదం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు అన్నారు. వర్సిటీలో ప్రముఖ న్యాయవాది 'డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీ'లను శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మధ్యవర్తిత్వంపై ప్రాధాన్యత పెరిగినందున అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా మధ్యవర్తిత్వాన్ని ఏ విధంగా నిర్వహించాలన్న అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఇక్కడి వర్సిటీలో మూడు రోజుల పాటు ఈ మధ్యవర్తిత్వ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 24 జట్లు పాల్గొంటున్నాయన్నారు. మూటింగ్ సొసైటీ ఫ్యాకల్టీ డాక్టర్ వి.సునీత మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ న్యాయవాది అయిన డీవీ సుబ్బారావు పేరుపై ఈ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అకాడమీ డీన్ సోమా భట్టాచార్య, ఎక్సామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ నీలిమ, డాక్టర్ సీహెచ్.లక్ష్మి, సంస్కృతి సిన్హా, ఆర్షిత్ మిశ్రా, కార్తికే బన్సాల్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఇంట్లో తిన్నాం 'అన్న' సంతృప్తి కలిగింది

- అనకాపల్లిలో అన్న క్యాంటీన్‌లకు పోటెత్తిన పేదలు
- రుచికరమైన భోజనాలు వడ్డించడంతో ఆనందం



ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో భోజనానికి క్యూ కట్టిన ప్రజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: పట్టణంలో అందుబాటులోకి వచ్చిన అన్న క్యాంటీన్‌లకు ప్రజలు పోటెత్తుతున్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వే స్టేషన్‌ల వద్ద గురువారం రాత్రి ఇవి పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. శుక్రవారం ఈ రెండు క్యాంటీన్లు రద్దీగా మారాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను వడ్డించారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద పేదలతో పాటు వైద్యాలయానికి వచ్చే రోగులు, గర్భిణులు, వారి సహాయకులు పెద్ద ఎత్తున క్యాంటీన్‌కు చేరుకుని ఐదు రూపాయల టోకెన్ తీసుకుని కడుపునిండా భోజనం చేశారు. మధ్యాహ్నం అన్నం, సాంబరు, వంకాయకూర, పచ్చడి, పెరుగు వడ్డించారు. భోజనం చేసిన ప్రతి ఒక్కరూ వంటకాలు చాలా రుచిగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ క్యాంటీన్ లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చి మధ్యాహ్నం వేళల్లో బయట హోటళ్లకు వెళ్లి రూ.వంద వెచ్చించి భోజనం చేయాల్సి వచ్చేదని ఒక గర్భిణి 'ఆంధ్రజ్యోతి' వద్ద అన్నారు. అన్న క్యాంటీన్ అందుబాటులోకి రావడం వల్ల ఇక ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా భోజనం సమస్య ఉండదన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఉన్న క్యాంటీన్‌లో వైద్యాలయంలో పనిచేసే కార్మికులతో పాటు రోగులు, సమీప కూరగాయలు, కొబ్బరికాయల మార్కెట్‌లో పనిచేసే కార్మికులు భోజనాలు చేశారు. ఇక్కడ మధ్యాహ్నం 390 మంది వరకు భోజనాలు చేసినట్టు నిర్వాహకుల ద్వారా తెలిసింది. అలాగే రైల్వేస్టేషన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, స్థానిక పేదలు భోజనాలు చేశారు. ఇక్కడ కూడా 300 మందికి పైగా భోజనాలు చేసినట్టు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మూసివేసిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం పుణ్యమా అంటూ అందుబాటులోకి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై రోడ్కెక్కిన విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- ప్రభుత్వం దృష్టికి తీసువెళ్తామని డీఆర్వో దయానిధి హామీ



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్నం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో అనకాపల్లిలోని శంకరంలోగల కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు విద్యార్థి సంఘ ప్రతినిధులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు చెల్లించాల్సిన మెస్ చార్జీలు పెంచాలని, గత ప్రభుత్వం చెల్లించాల్సిన వసతి దీవెన, విద్యా దీవెన, కాస్మొటిక్ చార్జీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. దీంతో డీఆర్వో బి.దయానిధి విద్యార్థుల వద్దకు వచ్చి వారితో చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు ఎం.బాలాజీ, కేశవ్, వెంకటేశ్, రమేశ్, జ్ఞానేశ్, స్వామి, అర్జున్, దుర్గా, మోహన్, సాయి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడుగా మీసాల సుబ్బన్న ప్రమాణం

- క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపు



ప్రమాణస్వీకారం చేసిన సుబ్బన్నను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీని జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అంతా సమన్వయంతో కృషి చేద్దామని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానన్నారు. పార్టీలో వివిధ పదవులు చేపట్టిన తనకు రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్య అతిధిగా హాజరైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు సుబ్బన్నతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.పైడయ్య, తనకాల అనంతరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుబ్బన్నను ఘనంగా సత్కరించారు.

కల్యాణపులోవ జలాశయం 2 గేట్లు ఎత్తివేత

- సర్పానదిలోకి 100 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, సెప్టెంబరు 20: మండలంలోని కల్యాణపులోవ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని విడిచి పెట్టినట్టు ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. ఆయన శుక్రవారం జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్య 460 అడుగులు అని చెప్పారు. గురువారం రాత్రి రిజర్వాయర్ పరీవాహక ప్రాంతం ఎగువన కురిసిన వర్షాలకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో శుక్రవారం నాటికి 458.90 అడుగులకు నీటి మట్టం చేరిందన్నారు. సామర్థ్యానికి మరో ఒక అడుగు మాత్రమే ఉన్నందున రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల మేర నీటిని సర్పానదిలోకి విడిచి పెట్టడం ద్వారా రిజర్వాయర్ నీటి మట్టాన్ని స్థిరీకరిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సర్పానదికి ఆనుకొని ఉన్న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, కన్నంపేట, జగ్గంపేట, జె.నాయుడుపాలెం, కొమరవోలు, ఆర్.కొత్తూరు, కుసర్లపూడి, తూటిపాల, తాడపాల, కొండల అగ్రహారం గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈ సూచించారు.

6 నుంచి నునపర్తిలో బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

- రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు
- ట్రోఫీని ఆవిష్కరించి ఎమ్మెల్యే 'సుందరపు'



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 20: మండలంలోని నునపర్తి గ్రామంలో వచ్చే నెల ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు తొమ్మిదవ ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 బాల బాలికల చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ట్రోఫీని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పదమూడు జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు. అక్కడ అద్భుతంగా రాణించే వారు జాతీయ జట్టుకు ఎంపికవుతారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ప్రభూజీ, గొంప నరసింహనాయుడు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే



విజ్ఞాపనలతో వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 20: పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఇక్కడి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎం.దీపికా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో

మాకవరపాలెం, సెప్టెంబరు 20: మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని డీఈవో వెంకటలక్ష్మమ్మ హెచ్చరించారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం పెట్టించారు. మెనూ అమలు, విద్యా బోధన తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అలాగే హైస్కూల్‌లో చేస్తున్న బోధనపై ఉపాధ్యాయలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మూర్తి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్చుతరామయ్య పాల్గొన్నారు.


అరకులోయ: పెదలబుడులో ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్, ఉద్యోగులు


అనంతగిరి: పూలుగుడలో ఇంటింట ప్రచారం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర


చింతపల్లిలో ఓ గృహం బయట స్టిక్కర్ అంటిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

‘ఇది మంచి ప్రభుత్వం’.. విజయవంతం

100 రోజుల పాలనలో కూటమి పథకాలపై విస్తృత ప్రచారం

మన్యంలోని అన్ని మండలాల్లో ప్రజల నుంచి మంచి స్పందన

పాడేరు రూరల్/అరకులోయ/చింతపల్లి/ముంచంగిపుట్టు/అనంతగిరి/గూడెంకొత్తవీధి/సీలేరు/డుంబ్రిగుడ/హుకుంపేట, సెప్టెంబరు 20: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ప్రారంభించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని మన్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కూటమి నాయకులు, అధికారులు మన్యంలో ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనిపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతీ నెల 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు, వృద్ధులు, వితంతులు, వికలాంగులు తదితర అర్హత గల లబ్ధిదారులకు రూ.4 వేలు చొప్పున ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న ఘనత చంద్రబాబునాయుడుదేనని, మెగా డీఎస్సీలో 16,347 ఉద్యోగా నియామకానికి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పేదల కడుపులు నింపే అన్నా క్యాంటీన్‌లు పునరుద్ధరణ, విద్యార్థుల నైపుణ్యం పెంపొందించే (స్కిల్ సెన్సెస్) దస్త్రం వంటి ప్రధాన మైన పథకాలను అమలులోకి తీసుకురావడం, వరద బాధితులకు నష్టపరిహారం అందించి కష్టాల్లో ఉన్న ప్రజలకు భరోసా కల్పించడం జరిగిందని పాడేరు, అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టు, అనంతగిరి, గూడెంకొత్తవీధి, సీలేరు, డుంబ్రిగుడ, హుకుంపేట తదితర మండలాల్లో కూటమి నాయకులు, అధికారులు ప్రజలకు వివరించారు. పాడేరులోని గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.సాయి నవీన్, తహసీల్దార్ వంజంగి త్రినాధరావునాయుడు, పంచాయతీ ఈవో ఆర్‌వీఎస్.రమేష్, ఎంపీపీ సొనాయి రత్నకుమారి, ఎన్డీఏ కూటమి పాడేరు నియోజకవర్గ నాయకులు ఎంవీఎస్.ప్రసాద్, బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, గంగపూజారి శివకుమార్, చల్లంగి లక్ష్మణరావు, బొర్రా విజయరాణి, చల్లంగి జ్ఞానేశ్వరి, డి.వెంకటకుమారి, అల్లంగి సుబ్బలక్ష్మి, కట్టంగి పద్మ, లకే పార్వతమ్మ, డప్పోడి వెంకటరమణ, గూడెపు ఉషారాణి, వర్తన వరలక్ష్మి, బొడ్డేటి వరలక్ష్మి, బుద్ద జ్యోతికిరణ్, వంతాల కళ్యాణి, వంతాల చిరంజీవి, గబ్బాడ కుమారి, తోట దొరబాబు, కిల్లో పూర్ణచందరరావు, వంతాల కొండలరావు, కూడి రామునాయుడు, ముక్కలి రమేష్ పాల్గొన్నారు. అలాగే అరకులోయలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో నాయకులు ప్రతీ ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతగిరి మండలంలోని బొర్రా పంచాయతీ మారుమూల పూలుగుడ గ్రామంలో అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పూలుగుడ అభివృద్ధి, రోడ్డు, ఇంటింటికీ కొళాయి, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను నిర్మాణానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు, ఉద్యోగులు పేర్కొచేస్తామన్నారు. కార్యక్రమంలోని ఎస్సీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పి.నిర్మల, జనసేన మండల అధ్యక్షుడు సిహెచ్.మురళి, కూటమి నాయకులు పి.భీమన్న, జె.చిట్టిబాబు, పి.బాబీ, ఏ.జానకీ, పి.రవీంద్ర, ఎంపీడీవో నగేష్, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బూర్జ లక్ష్మి, కార్యవర్గ సభ్యులు ఎమ్.జోగులు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, ఎస్.సుందరరావు, మట్టం శ్యామ్, కె.కృష్ణ, దయానిధి పాల్గొన్నారు. చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ మడిగుంట గ్రామంలో తహసీల్దార్ రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను ఆవిష్కరించి ప్రతీ గృహానికి స్టిక్కర్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సమిడి గోపాల్, జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు మండల కేంద్రానికి సమీపంలోని కించాయిపుట్టు సచివాలయం పరిధిలో ఎంపీడీవో కిరణ్‌కుమార్‌తో పాటు రెవెన్యూ కూటమి నేతలు ఇళ్లకు ఇది మన ప్రభుత్వం స్టిక్కర్లను అతికించి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. దారెల పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగ స్వామి ఆధ్వర్యంలో ఇది మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు కె.బలరాం, వి.లక్ష్మణ్, ఎం.చిన్నిబాబు, వి.లక్ష్మణ్, సూర్యనారాయణ, బాబూజీ పాల్గొన్నారు. గూడెంకొత్తవీధి మండలంలోని అద్దరవీధి గ్రామంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రతీ గృహానికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. పీఆర్ ఏఈఈ జ్యోతిబాబు, కూటమి నాయకులు ముక్కలి రమేశ్, కొర్ర బలరామ్, మామిడి బాలయ్య, సిరిబాల బుజ్జిబాబు, మొట్టడం రామకృష్ణ, గొర్లె వీర వెంకట్, గడుతూరి పరమేశ్వరరావు, నాడెల సత్యారావు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో ఎంపీడీవో ఉషారాణి ఈ కార్యక్రమం నిర్వహించారు. కించుమండ పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంటు కోశాధికారి నాగేశ్వరరావు, ఎంపీటీ సభ్యురాలు గీత, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ దనేరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, సీలేరులో తహసీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ పి.సాంబమూర్తి, ఉప సర్పంచ్ కె.వల్లీప్రసాద్, నాయకులు కె.సన్యాసిరావు, సిహెచ్.రాము, లూసీ, వి.రాము, చంద్రావు, గోవింద్, బాలు, కె.అప్పలరాజు, మింది పాల్గొన్నారు. హుకుంపేటలోని ప్రతీ పంచాయతీకి ప్రచారం చేశారు.


డీఎంహెచ్‌వోకు సమ్మె కొనసాగింపు నోటీసు అందిస్తున్న పీహెచ్‌సీల వైద్యులు

జీవో-85కు వ్యతిరేకంగా సమ్మె కొనసాగింపు

» పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీజీ ప్రవేశాల సర్వీసు కోటా కుదిస్తూ జారీ చేసిన జీవో నంబరు-85కు వ్యతిరేకంగా సమ్మెను కొనసాగిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో జమాల్ బాషాకు శుక్రవారం నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జీవో నంబరు 85ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో సమ్మెను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో కచ్చితంగా పనిచేయాలనే ఒప్పందాన్ని పదేళ్లకు పెంచడంతో పాటు మధ్యలో ఉద్యోగాన్ని విడిచిపెట్టాల్సి వస్తే రూ.50 లక్షలు చెల్లించాలని పేర్కొనడం విచారకరమని వాపోయారు. ఆ జీవోను రద్దుచేసి పాత పద్ధతిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సమ్మెను విరమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సందీప్, కోశాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి, పీహెచ్‌సీ వైద్యులు డీకే.హిమబిందు, లక్ష్మీకాంత్, కిరణ్, మణిదీప్, సత్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

» జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ పిలుపు


డిగ్రీ కళాశాలలో రక్తాన్ని దానం చేస్తున్న దాతలు

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలు కావాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాధితుల అవసరాలకు తగ్గట్టుగా రక్త నిల్వలు ఉండడం లేదని, రక్త నిల్వలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అలాగే రక్తదాన శిబిరంలో 30 యూనిట్‌లు రక్తాన్ని సేకరించినందుకు దాతలు, శిబిరం నిర్వాహకులను జేసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, నాయకులు రాఘవేంద్రరావు, పి.మత్స్యకొండబాబు, సల్లా రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ పీవో గౌరీశంకరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త, ప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని మాతృ భాషా విద్యా వలంటీర్ల ఆందోళన



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్లు

పాడేరు రూరల్, సెప్టెంబరు 20: ఆదివాసీ మాతృ భాషా విద్యా వలంటీర్ల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాల ప్రధాన గేటు వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆదివాసీ మాతృ భాషా విద్యా బోధనకు అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు 676 మందిని రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరానికి పాఠశాల విద్యా కమిటీ ద్వారా నియమించిందన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహించి విద్యా ప్రమాణాలు మెరుగుకు వారు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వలంటీర్లను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘం జిల్లా నాయకులు పాంగి శ్రీను, పాంగి కుమారి, కె.వీరయ్య, కె.కొండయ్య, డి.రాజబాబు, ఎం.బాబీ, ఎస్.చిన్నమ్మి, సత్యవతి, ఎస్.నాగేంద్ర, కె.రమేష్, కె.సత్యనారాయణ, వి.రమేష్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో బహుళ ప్రయోజనాలు

రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు


బరిసింగి గ్రామంలో పంటలపై జీవామృతంతో పిచికారీ చేస్తున్న దృశ్యం

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని రైతు సాధికారత సంస్థ (ప్రకృతి వ్యవసాయం) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు అన్నారు. మండలంలోని బరిసింగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి సేద్య పద్ధతులతో వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేపట్టడడం ద్వారా భూసారం పెరగడంతో పాటు పంటల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. అలాగే ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గడంతో పెట్టుబడి వ్యయం సైతం తగ్గుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 94 వేల గిరిజన కుటుంబాలు ప్రస్తుతం లక్షా 74 వేల 908 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో సేంద్రియ పద్ధతి సాగు అలవాటులో ఉండడంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింత సులభంగా కొనసాగించవచ్చునన్నారు. అలాగే గిరిజన రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు, కరపత్రాలు, శిక్షణ కార్యక్రమాలను తమ సంస్థ అందిస్తుందని వాసన్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్ సన్నీ పేర్కొన్నారు. గిరిజన రైతులకు తమ భూమిలో ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగుకు ముందుకు వస్తే తామే అన్ని విధాలా ప్రోత్సాహిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వాసన్ స్వచ్ఛంద సంస్థ మరో అసోసియేట్ డైరెక్టర్ బక్కారెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ నాయుడు, రైతు సాధికారత సంస్థ సిబ్బంది రవీంద్ర, జానకి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయి

పాడేరు రూరల్, సెప్టెంబరు 20: విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ చెప్పారు. తలారిసింగి పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ తదితర క్రీడలను అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వి.కొండబాబు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23న నియోజకవర్గ స్థాయిలో పాడేరు, అరకువేలి, రంపచోడవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హుకుంపేట, కొయ్యూరు, అనంతగిరి, పెదబయలు, నెల్లిపాక దేవీపట్నం ఎంఈవోలు చెల్లయ్య, రాంబాబు, బాలాజీ, కృష్ణమూర్తి, మల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ కిల్లో బాలి, మాజీ సెక్రటరీ పి.సూరిబాబు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్లు కుమారి, సత్యవతి, చిన్నిబాబు, రఘు, రామునాయుడు, కోటేశ్వరరావు, వివ, భూపతిరాజు, రాజులమ్మ, వెంకటేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కొయ్యూరు, సెప్టెంబరు 20: అంకితభావంతో పనిచేసే అధికారులకు మంచి గుర్తింపు ఉంటుందని వక్తలు కొనియాడారు. బదిలీపై వెళుతున్న ఎస్ఐలు రాజారావు, లోకేష్‌కుమార్, ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ మూర్తిలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరామూర్తి, వైస్ ఎంపీపీలు ఎ.వెంకటరమణ, అంబటి నూకాలమ్మ హాజరై ఎస్ఐల సేవలను కొనియాడారు. ప్రధానంగా ఎస్ఐ లోకేష్‌కుమార్ మంప, బూదరాళ్ల, మఠంభీమవరం, యు.చీడిపాలెంలలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎ.అప్పలనర్స, డి.రమేష్, నాయకులు ఎ.చిరంజీవి, రేవళ్ల రాజు, లక్ష్మీరాజ్, ఎ.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి పునరుద్ధరణ పనులు

సీలేరు, సెప్టెంబరు 20: సీలేరు-జీకే వీధి రహదారి పనులను శరవేగంగా పునరుద్ధరిస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు తెలిపారు. కాంక్రీట్ వేసే పనులను శనివారం నుంచి ప్రారంభించామని చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో బస్సులు పునరుద్ధరణకు చర్యలు చేపడుతుని ఈఈ చెప్పారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 20: అనుమతి తీసుకోకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పాపినాయుడు హెచ్చరించారు. మండల వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామని, రాత్రుల్లో ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ధారాలమ్మకు వెండి కిరీటం బహూకరణ

సీలేరు, సెప్టెంబరు 20: ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువైన ధారాలమ్మకు 400 గ్రాముల వెండితో తయారు చేసిన కిరీటాన్ని భక్తులు శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. తునికి చెందిన కొరసల సాయివినీల్‌కాంత్, జస్మిన్ అమ్మవారిని దర్శించుకుని వెండి కిరీటాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారి చేతుల మీదుగా అమ్మవారికి కిరీటాన్ని అలంకరించారు.



గడపరాయిలో కలప దుంగలు స్వాధీనం

చింతపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని గడపరాయి గ్రామంలో 178 టేకు, మారుజాతి కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు రేంజ్ అధికారి అప్పారావు తెలిపారు. శుక్రవారం పక్కా సమాచారంతో గ్రామంలోని కార్పెంటర్ కేశ్వరరావు షెడ్డులో దాడులు చేశామన్నారు. షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన టేకు, వేగిస, గనర, మద్ది కలప దుంగలను, రెండు మిషన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. కలప దుంగలను కొలతలు వేసి గోదాముకి తరలించామన్నారు. కలప నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకట రాజు, ఎఫ్‌బీవో చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.

పండుగలా ‘ఇది మంచి ప్రభుత్వం’

... 5వ పేజీ తరువాయి

ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే అరకులోయలో స్థానిక సర్పంచ్ పెటేలి దాసుబాబు ఆధ్వర్యంలోనూ స్థానికంగా ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించి వంద రోజులు కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలిపారు.

రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

జిల్లాలోని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెడిచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేవలం వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శిరీషాదేవి అన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో ఉత్సాహంగా కూటమి క్యాడర్ పాల్గొంది. పలు మండల, పంచాయతీ కేంద్రాల్లో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాలను శుక్రవారం లాంఛనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారం రోజులుపాటు నిర్వహించేందుకు వెసులుబాటు ఉండడంతో ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళిక సిద్ధం చేశారు.

నిండుకుండలా మినీ రిజర్వాయర్లు

... 5వ పేజీ తరువాయి

రిజర్వాయర్ పటిష్టతపై గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు.

‘కొర్రాయి’ రైతులదీ అదే పరిస్థితి

డుంబ్రిగుడ మండలంలోని కొర్రాయి మినీ రిజర్వాయర్ టీడీపీ హయాంలో నిర్మించారు. దీని ఆయకట్టు 110 ఎకరాలు. ఏటా వర్షాధారంపై సాగు చేసే ఆయకట్టు రైతులు రిజర్వాయర్ నిర్మాణంతో ఏడాది పొడవునా పంటలు పండించుకునేవారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినీ రిజర్వాయర్‌లో పూర్తిగా నీరు చేరింది. అయితే మదుములు మరమ్మతులకు గురవడంతో నీరు వృథాగా పోతున్నది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అసలు మరమ్మతులు చేపట్టలేదని, దీనివల్ల నీరు వృథాగా పోతున్నదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రిజర్వాయర్ చివర కోతకు గురైందని రైతులు తెలిపారు. మినీ రిజర్వాయర్ కుడి,ఎడమ కాలువల్లో పూడిక, తుప్పలు పెరిగిపోయాయని, భూములకు పూర్తి స్థాయిలో నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమిలిగుడ, కొర్రాయి మినీ రిజర్వాయర్లకు మరమ్మతులు చేయాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

భీమిలి ఆర్డీవో బరితెగింపు!

... 5వ పేజీ తరువాయి

వచ్చింది. సాధారణంగా తన వద్దకు భూముల ఫైలు వస్తే వెంటనే సదరు భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించడం విశ్వనాథన్‌కు అలవాటు. ఆయన స్వయంగా మధురవాడలో సర్వే నంబరు 133లో గల భూమిని పరిశీలించి హౌసింగ్ బోర్డుకు కేటాయించినదిగా గుర్తించారు. అయినా ప్రైవేటు వ్యక్తికి చెందిన భూమిగా పేర్కొంటూ ఫైలు పంపడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆర్డీవో, అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. తరువాత కొద్ది నెలలకు జేసీని ప్రభుత్వం బదిలీ చేయడం, ఈలోగా ఎన్నికలు రావడంతో భూమి వ్యవహారం తెర మరుగైంది. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వే నంబరు 133లో గల భూ వ్యవహారంపై దృష్టిసారించింది. అక్రమాలు జరిగినట్టు గుర్తించి ఆర్డీవో భాస్కర్‌రెడ్డితో పాటు ఆర్ఐ మల్లేశ్వరరావు, గ్రేడ్-2 వీఆర్వో దుర్గాప్రసాద్‌పై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. తహసీల్దారు రమణయ్య అప్పటికే హత్యకు గురికావడంతో ఆయన పేరు ప్రస్తావించలేదు. తహసీల్దారుగా ఉన్నప్పుడు సర్వే నంబరు 133లో భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించిన భాస్కర్‌రెడ్డి, అదే ఆర్డీవో అయిన తరువాత అదే భూమిలో 3.47 ఎకరాలు ప్రైవేటు వ్యక్తికి అప్పగించేలా ఫైలు పంపడం పరిశీలిస్తే అక్రమాలకు ఏ విధంగా సహకరించారో అర్థమవుతుందని రెవెన్యూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు అనంతరం సెలవుపై విదేశాలకు వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఇటీవల తిరిగి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే హౌసింగ్ బోర్డు భూమి వివాదంలో ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ఫైలు సిద్ధమైంది. అయినా ఆయన ఆర్డీవోగా తిరిగి బాధ్యతలు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఆశ్చర్యకరం.

☛ సంక్షిప్తంగా..

టీడబ్ల్యూ డీడీ కార్యాలయంపై తప్పుడు ఆరోపణలు తగదు

పాడేరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కార్యాలయంపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టీడబ్ల్యూ కార్యాలయ సిబ్బంది పనితీరు బాగాలేదని ఇచ్చిన ప్రకటనపై కార్యాలయ సిబ్బంది స్పందించారు. కార్యాలయంలో తక్కువ మంది సిబ్బంది ఉన్నప్పటికీ, ఫైళ్లు, ఇతర వ్యవహారాలు, ఐటీడీఏ నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమపై సంఘం నేతలు అకారణంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ఆరోపణలను ఉపసంహరించుకోవాలని, రేయింబవళ్లు శ్రమిస్తున్న తమపై అనవసర నిందలు వేయవద్దని టీడబ్ల్యూ కార్యాలయ సిబ్బంది ముూకుమ్మడిగా హితవు పలికారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సాగిన కోటిబాబు

చింతపల్లి, సెప్టెంబరు 20: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల అధ్యక్షుడిగా సాగిన కోటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అనకాపల్లి జిల్లా నేత ఎం.దేముడు తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన భవన్‌లో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రకాశరావు, ఉపాధ్యక్షుడిగా డి.రాజేశ్వరి, కార్యదర్శిగా మనోహర్, జిల్లా కౌన్సెలర్‌గా జర్ర సింహాచలం, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఈశ్వరి, ఆనంద్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయులు వీరయ్యదొర, లక్ష్మణ్, రామరాజు, వీరబాబు, రవి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

లంకపాకలులో 12 ఎకరాల కాఫీ తోటలు ధ్వంసం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 20: మండలంలోని లంకపాకలు గ్రామంలో అధిక వర్షాలకు 12 ఎకరాల కాఫీ తోటలు ధ్వంసమపోయాయని ఉద్యానవన శాఖాధికారి కె.అరుణకుమారి తెలిపారు. శుక్రవారం గ్రామంలో కాఫీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు గ్రామంలోని కాఫీ తోటలపై కొండచరియలు, వరద ప్రవహించిందన్నారు. దీంతో అధికంగా కాఫీ మొక్కలు వరదలో కొట్టుకుపోయాయని, కొన్ని మొక్కలు విరిగిపోయాయని చెప్పారు. కాఫీ తోటలను నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీ చిన్నారావు, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు

సీలేరు, సెప్టెంబరు 20: దుప్పులవాడ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. కొమ్ములవాడ, బంధవీధి, గొర్లెవ, గుండేరుబయలు గ్రామాలను వైద్య సిబ్బంది సందర్శించి రోగాల బారిన పడిన గిరిజనులకు వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఈ సీజన్‌లో ప్రబలే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. కాచి ఒడబోసిన నీటిని తాగాలని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథరావు, హెచ్‌వీ బాలమణి, ఏఎన్ఎం అరుణకుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు వినియోగించుకోండి

కొయ్యూరు, సెప్టెంబరు 20: రాయితీ విత్తనాలను వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని బూదరాళ్ల, మర్రివాడ పంచాయతీల రైతులకు 90 శాతం రాయితీపై శుక్రవారం రాజ్‌మా విత్తనాలను సరఫరా చేశారు. చీడిపాలెం రైతు సేవ కేంద్రంలో ఎంపీపీ బడుగు రమేష్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏవో విత్తనశుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ఎంపీపీ వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, వైస్ ఎంపీపీ అప్ప వెంకటరమణ, సర్పంచ్ తదితరులు ప్రభుత్వ ఆశయాలను వివరించారు.

కల్వర్టు, బ్రిడ్జిలు నిర్మించాలి: ఎంపీపీ

చింతపల్లి, సెప్టెంబరు 20: బలపం పంచాయతీలో వరదలకు కొట్టుకుపోయిన కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి కోరారు. శుక్రవారం జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి పంచాయతీలో పర్యటించి పంట పొలాలు, కల్వర్టులు, బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. కోరుకొండ-బూరుగుబయలు, చెరువూరు-గిల్లలబంద గ్రామాల మధ్య కల్వర్టు, బ్రిడ్జి కొట్టుకుపోవడం వల్ల 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన శాశ్వత కల్వర్టులు నిర్మించేవరకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ కోరుకొండ-బూరుగుబయలు మధ్యలో కల్వర్టు నిర్మాణానికి గత ఎమ్మెల్యే, పీవోలు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచులు దురియా పుష్పలత, కె.రమేష్, ఉప సర్పంచ్ జి.మోహన్, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చింతపల్లి, సెప్టెంబరు 20: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కేంద్ర కాఫీ బోర్డు జేఎల్‌వో ప్రదీప్‌కుమార్ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నా దేశం-నా కళాశాల పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా జేఎల్‌వో మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, అధ్యాపకులు శ్రీనివాసపడాల్, లీలాపావని పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు

చింతపల్లి, సెప్టెంబరు 20: పసుపు, మిరియాల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శివకుమార్ చెప్పారు. ఉద్యాన పరిశోధన స్థానంలో శుక్రవారం గిరిజన రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు పంట కోసం ఎత్తు నారు మడుల్లో నాట్లు వేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేసుకున్న దుంపలను నాటుకోవాలన్నారు. మిరియా పంటలో తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శెట్టి బిందు, కె.అప్పలరాజు పాల్గొన్నారు.